www.nagaranijam.com
RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక

NN NEWS నగరనిజం

| సంపుటి : 13 | సంచిక : 162 | రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 2 మంగళవారం, సెప్టెంబర్ 2025 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 13 | Issue : 162 | Rangareddy | Editor : Yela.Purushotham | 2 Tuesday ,September 2025 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

# రాష్ట్రంలో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా నిరుద్యోగులు

## కేవలం 13,000 ఉద్యోగాలు ఇచ్చి చేతులు దులుపేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **పొంతనలేని మంత్రుల మాటలు**
- **నిజంగా ఉద్యోగాలు ఇచ్చారనుకుంటే, ఎక్కడ ఇచ్చారో చూపించండి**
- **రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని**
- **బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్**



**హైదరాబాద్ సెప్టెంబర్ 1 (నగరనిజం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా నిరుద్యోగుల పరిస్థితి నెలకొందని బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆందోళన వ్యక్తం చేసారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలోఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో 10 సంవత్సరాల పాటు నానబెట్టింది. కానీ ఉద్యోగాలు కల్పించలేదు.గత పదేళ్లుగా ప్రతి సంవత్సరం 8,000 మంది ఉద్యోగులు రిటైర్మెంట్ అయ్యారు. ఇప్పుడు సుమారుగా 80,000 ఉద్యోగాలు రావాలి.ఆ ఉద్దేశంతోనే ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలనే తపనతో, తమ తల్లిదండ్రులను కష్టపెట్టకూడదనే ఉద్దేశంతో హైదరాబాద్ వచ్చి, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 కోచింగ్‌లు తీసుకున్నారు.చాలామంది నిరుద్యోగులు రూ.5,000తో భోజనంతో సర్దిపెట్టుకుని, ఎట్టి పరిస్థితుల్లోనైనా ఉద్యోగం సాధించాలని తపనపడుతూ కష్టపడ్డారని తెలిపార్టు.TSPSC లో ఇప్పటివరకు 30 లక్షల మంది ఎన్‌రోల్ అయ్యారు. ఇంకా ఎన్‌రోల్ కానివారు కూడా 15%-%20 లక్షల మంది ఉన్నారు. కాని తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో ఏదైతే చేయలేకపోయిందో, కాంగ్రెస్ పార్టీ చేస్తామని చెప్పింది. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చారు. కానీ ఆ డిక్లరేషన్ అమలు కాలేదు.రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కూడా అసెంబ్లీలో చెప్పారు. దీంతో చాలా మంది నిరుద్యోగులు హ్యాపీగా ఫీల్ అయ్యారు. కానీ వాస్తవం వేరేలా ఉంది.గత బీఆర్ఎస్ ప్రభుత్వం 48,000 ఉద్యోగాలు ఇస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 13,000 ఉద్యోగాలు ఇచ్చి చేతులు దులుపేసుకుంది. అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి, "మా అకౌంట్లలో వేసుకోండి" అని ప్రపోజల్ పెట్టారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్కొక్కరు.. ఒక్కో మంత్రి ఒక్కోలా చెబుతున్నారు. ఒకరు 60,000 ఉద్యోగాలు ఇచ్చామని.. ఇంకొకరు 65,000 ఉద్యోగాలు ఇచ్చామని అంటున్నారు. మరొకరు 70,000 ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారు.మంత్రి శ్రీధర్ బాబు చెప్పిన దానిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు పునరావృతం చేస్తున్నారు. తర్వాత బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు 1 లక్ష ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. మరి నిజంగా ఎక్కడ ఇచ్చారు?నేను సవాలు విసురుతున్నాను -నిజంగా ఉద్యోగాలు ఇచ్చారనుకుంటే, ఎక్కడ ఇచ్చారో చూపించండి. అమరవీర స్థూపం దగ్గరకు నేను వస్తాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాల నోటిఫికేషన్లు ఎన్ని ఉన్నాయో చూపించండి. కాంగ్రెస్ మంత్రులు ఈ సవాలు స్వీకరించి చర్చకు రావాలి. చర్చకు మేం రెడీ.రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఎన్నికల ముందు రాహుల్ గాంధీ అశోక్‌నగర్‌కి వచ్చినప్పుడు కూడా "2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం, నిరుద్యోగ భృతి ఇస్తాం" అని చెప్పారు. కానీ ఈ రోజు పరిస్థితి ఏమిటంటే - నిరుద్యోగుల వయసు మించి పోతోంది. కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, కేవలం 6.5% మాత్రమే ఇచ్చి చేతులు తుడిచేసుకుంది.నిరుద్యోగుల గొంతుకై శాసన మండలిలో మాట్లాడాలని ఎంతో ప్రయత్నించాం. కానీ బీఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం విషయంలో సీబీఐకి వెళ్తే సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో సమావేశాన్ని వాయిదా పడింది.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, భారతీయ జనతా పార్టీ తరపున మేం డిమాండ్ చేసారూ.



# బీసీ ఉద్యమకారుడు, సామాజికవేత్త డా. వకుళాభరణం కృష్ణమోహన్ బీజేపీలో చేరిక

**హైదరాబాద్ సెప్టెంబర్ 1 (నగరనిజం న్యూస్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు బీసీ కమిషన్ సభ్యుడిగా, తెలంగాణ రాష్ట్రంలో తొలి బీసీ కమిషన్ సభ్యుడిగా, అనంతరం రెండోసారి హయాంలో బీసీ కమిషన్ చైర్మన్‌గా సేవలందించిన డా. వకుళాభరణం కృష్ణమోహన్ గారు.. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు, రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ గారి సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వకుళాభరణం కృష్ణమోహన్ కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ డా. వకుళాభరణం కృష్ణమోహన్ బీజేపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.తెలంగాణ రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యువత, మేధావులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బీజేపీలో చేరుతున్నారు.వకుళాభరణం కృష్ణమోహన్ బీసీ కమిషన్‌కు మూడుసార్లు సభ్యుడిగా, ఒకసారి చైర్మన్‌గా పనిచేసి ఇప్పుడు బీజేపీలో చేరారు.డా. వకుళాభరణం కృష్ణమోహన్ ఉన్నత విద్యావంతుడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ఎంబీసీ కమిషన్ చైర్మన్ గా పనిచేసిన తాడూరి శ్రీనివాస్ కూడా ఇప్పటికే బీజేపీలో చేరారు. ఇప్పుడు బీసీ కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ చేరారు.ఇది తెలంగాణలో స్పష్టమైన సంకేతం -బీసీలు, ఎంబీసీలు అందరూ బీజేపీతో ఉన్నారు. బీసీల హక్కులను రక్షించేది బీజేపీ మాత్రమేనన్నారు.

# మోదీ-పుతిన్ భేటీకి ముందు భారత్‌పై అమెరికా ప్రశంసలు...

- **వ్యూహాత్మక ఎత్తుగడా?**



**హైదరాబాద్ సెప్టెంబర్ 1 (నగరనిజం న్యూస్):**షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీవో) వేదికగా ఆసక్తికర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల ద్వైపాక్షిక సమావేశానికి కొద్ది నిమిషాల ముందు, భారత్ పట్ల అమెరికా తన వైఖరిని మార్చుకుంది. ఇప్పటివరకు భారత్‌పై విమర్శలు గుప్పించిన ట్రంప్ యంత్రాంగం నుంచి అనూహ్యంగా ప్రశంసలు వెల్లువెత్తడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందని సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వ్యాపారం, రక్షణ, సృజనాత్మకత వంటి అనేక రంగాల్లో సహకారం అద్భుతంగా ముందుకు సాగుతోందని ఆయన కొనియాడారు. "21వ శతాబ్దంలో భారత్-అమెరికా సంబంధాలు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాయి. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న స్నేహమే మా బంధానికి పునాది" అని రూబియో తన పోస్టులో వివరించారు.అయితే, రూబియో ఈ ప్రశంసలు గుప్పించడానికి కొన్ని గంటల ముందే ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో నుంచి భారత్‌పై తీవ్రమైన ఆరోపణలు రావడం గమనార్హం. ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ కారణమంటూ ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు.

# పర్యావరణాన్ని ప్రేమిద్దాం.... ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం









- **మల్ రెడ్డి దేవేందర్ రెడ్డి**
- **శ్రీ శారదా విద్యా మందిర్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా పర్యావరణ గణపతి నిమజ్జనోత్సవం**
- **పర్యావరణ గణపతికి వీడ్కోలు పలికిన శ్రీ శారద విద్యా మందిర్ స్కూల్ విద్యార్థులు**
- **పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్న స్కూల్ కరెస్పాండెంట్ మల్ రెడ్డి దేవేందర్ రెడ్డి**

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (నగరనిజం ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మధురా నగర్ కాలనీలో పర్యావరణ గణపతికి శ్రీ శారదా విద్యా మందిర్ స్కూల్ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. గడిచిన ఆరు రోజులపాటు పర్యావరణ గణపతిని భక్తి శ్రద్ధలతో పూజించిన స్కూల్ విద్యార్థులు.... అదే రీతిలో సోమవారం నాడు పర్యావరణ గణపతికి వీడ్కోలు పలుకుతూ ఘనంగా నిమజ్జనం చేశారు. మరోవైపు పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు సామాజిక ఉద్యమం చేపట్టాలని స్కూల్ కరస్పాండెంట్ మల్ రెడ్డి దేవేందర్ రెడ్డి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి మధురానగర్ కాలనీ లోని శ్రీ శారదా విద్యా మందిర్ స్కూల్ ఆవరణలో గత ఆరు రోజుల క్రితం స్కూల్ కరస్పాండెంట్ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ గణపతిని ప్రతిష్టించారు. రంగురంగుల గణపతి విగ్రహాలు వద్దు.... పర్యావరణ గణపతి ముద్దు అంటూ విద్యార్థులు గడిచిన ఆరు రోజులుగా లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సోమవారం నాటికి వేడుకలు ఆరో రోజుకు చేరుకోవడంతో స్కూల్ కరస్పాండెంట్ దేవేందర్ రెడ్డి తో పాటు ఉపాధ్యాయులు,విద్యార్థులు, నిమజ్జోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.స్వామివారి పల్లకీ సేవకు ముందు స్కూల్ ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిమజ్జనం వేడుకల్లో హైలైట్ గా నిలిచాయి.

### విద్యార్థులతో కలిసి కోలాటం వేసిన కరస్పాండెంట్ దేవేందర్ రెడ్డి

ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులందరితో కలిసి స్కూల్ కరస్పాండెంట్ దేవేందర్ రెడ్డి సైతం ఎంతో ఉత్సాహంగా కోలాటం వేయడం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులతో పాటు ఆహుతులను ఉత్సాహపరచడానికి దేవేందర్ రెడ్డి స్వయంగా ఈ సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులంతా సాంప్రదాయ దుస్తులు ధరించి ఆధ్యాత్మిక, సాంప్రదాయ భజన గీతాలతో పాటు కోలాటాలు, లెజిమ్స్ ప్రదర్శనలతో పర్యావరణ గణపతిని పల్లకీలో ఊరేగింపుగా తరలించారు.మధురానగర్ కాలనీలోని శ్రీ శారదా విద్యా మందిర్ స్కూల్ నుండి మొదలైన స్వామివారి నిమజ్జనం ఊరేగింపు.....శంషాబాద్ లోని కాముని చెరువు వరకు కొనసాగింది. దారి పొడవునా విద్యార్థులు మట్టి గణపతిని పూజిద్దాం.... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం... ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం.... ఆరోగ్యంగా జీవిద్దాం... బలమే మన జీవనం.... జల కాలుష్యాన్ని నివారిద్దాం అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన స్కూల్ కరెస్పాండెంట్ దేవేందర్ రెడ్డి.... విద్యార్థులు చిన్ననాటి నుండి భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక భావనలను వంట పట్టించుకోవడంతో పాటు చక్కని క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా రాణించాలని దిశా నిర్దేశం చేశారు.అలనాడు స్వాతంత్ర్య సంగ్రామ పోరాటంలో బాలగంగాధర్ తిలక్ ఆధ్వర్యంలో సైతం వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఈ వేడుకల ద్వారా స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ప్రజలకు దేశభక్తిని నూరి పోయడం జరిగిందని దేవేందర్ రెడ్డి గుర్తు చేశారు. మరోవైపు పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్క విద్యార్థిపై ఉందన్న విషయాన్ని మర్చిపోరాదని ఆయన సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి విద్యార్థి సామాజిక ఉద్యమం చేపట్టాలని మల్ రెడ్డి దేవేందర్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పల్లకీ లో స్వామివారిని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు...ప్రత్యేక పూజల అనంతరం కాముని చెరువులో పర్యావరణ గణపతిని ఘనంగా నిమజ్జనం చేశారు.పోయిరావయ్యా గణపయ్య అంటూ విద్యార్థులు విగ్నేశ్వరుడికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ దేవేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా, స్కూల్ ఉపాధ్యాయులు మనీషా, అపర్ణ, సువర్ణ, రెబెకా, ఆసియా, రాణి, అఖిల, అప్సర, దౌలత్, రమాదేవి, దివ్య, శ్రీనివాస్, బాలరాజ్, స్వాతి, శోభ తదితర స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాయికల్ పట్టణ POPA నూతన కార్యవర్గం ఎన్నిక



రాయికల్ సెప్టెంబర్ 01 (నగర నిజం) జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ POPA (పద్మశాలి అఫీషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్) 2025 – 27 నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం శ్రీ భక్త మార్కండేయ దేవస్థానం ఆవరణలో జరిగింది. అధ్యక్షులుగా దాసరి రామస్వామి, ఉపాధ్యక్షులుగా సామల గంగాధర్, కార్యదర్శిగా సిరిపురం మహేష్, కోశాధికారిగా దాసరి కృష్ణ హరి ఎన్నికయ్యారు. వీరి ఎంపిక పట్ల రాయికల్ మండలం, పట్టణ, యువజన సంఘం, మహిళా సంఘం కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

## సీపీఎస్ ను రద్దు చేయాలి : ఎస్టీయూ



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 1 ( నగరనిజం ) :** ఎన్నికల మ్యానిఫెస్టోలో లో చెప్పిన విధంగా ప్రస్తుత ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ను రద్దుచేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టియు) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండు రంగారెడ్డి కోరారు. యాచారం మండలం కురిమిద్ద ఉన్నత పాఠశాలలో పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉపాధ్యాయులతో కలసి భోజన విరామ సమయములో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ... శాసన సభ్యులుగా, పార్లమెంట్ సభ్యులుగా 5 సంవత్సరాలు పదవి చేసిన వారికి జీవిత కాలం పెన్షన్ ఉంటుందని అన్నారు. 30 సంవత్సరాల పైబడి ఉద్యోగం చేసిన వ్యక్తికి పెన్షన్ లేకపోవడం శోచనీయమని వారు తెలిపారు. ఉద్యోగుల డబ్బులను షేర్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టి వచ్చిన లాభాలతో పెన్షన్ ఇస్తామనడం దుర్మాగమని వారు అన్నారు. నూతన పెన్షన్ స్కీంలో జమచేసుకుంటున్న డబ్బులు ఎక్కడ ఉన్నాయో, ఎన్ని ఉన్నాయో తెలియక సీపీఎస్ ఉద్యోగులు అందోళనలో ఉన్నారని వారు అన్నారు. అవసరానికి వాడుకునే వీలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అర్ధాంతరంగా చనిపోయిన ఉద్యోగి కుటుంబ సభ్యులకు వితంతువులకు వచ్చే పెన్షన్ కూడా రావడం లేదని వారు అన్నారు. భవిష్యత్తుకు భద్రత లేని సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

## ధావన్ పల్లి లో నీట మునిగిన కల్వర్టు.. రైతులకు నష్టం



**రాయికల్ సెప్టెంబర్ 01 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం దావనపల్లిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్వర్టు నీట మునిగి ప్రవహిస్తుంది. దీంతో దావనపల్లి – కట్కాపూర్ గ్రామాల మధ్య రవాణా అంతరాయం ఏర్పడినట్లు ప్రయాణికులు తెలిపారు. మరోపక్క వరద నీటి ప్రవాహానికి సరైన కాలువలు లేక పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోయారు. అలాగే వరద నీటిని ఎస్సారెస్పీ కాలువలోకి మళ్లించాలని కొందరు రైతులు కోరుతున్నారు

# లంబోదరుడి దయతో ప్రజలు సంతోషంగా ఉండాలి



- కాంగ్రెస్ నేత బండి వెంకటేష్ యాదవ్
- రాళ్లగూడ జై భవాని కాలనీ లో 6వ రోజుకు చేరుకున్న వినాయక ఉత్సవాలు
- స్వామివారిని దర్శించుకున్న శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, కాంగ్రెస్ నేత వెంకటేష్ యాదవ్
- వేడుకల్లో భాగంగా సతీ సమేతంగా హెూమం నిర్వహించిన కాలనీవాసులు



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ జై భవాని కాలనీ, యాదవ బస్తీల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. సోమవారం నాటికి వినాయక నవరాత్రి ఉత్సవాలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఆరవ రోజు ఉత్సవాల్లో భాగంగా కాలనీవాసులు సతి సమేతంగా స్వామివారి ముందు హెూమం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత బండి కానీ వెంకటేష్ యాదవ్



తదితర నేతల బృందం ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ మేరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పురోహితుల చేత ఆశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ సీనియర్ నేత బండి వెంకటేశ్ యాదవ్.... శ్రీ విఘ్నేశ్వరుడి కృపా కటాక్షాలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కోరిన కోర్కెలు తీర్చే విగ్నేశ్వరుడికి తొలి పూజ నిర్వహించడం హైందవ సంస్కృతి అని ఆయన పేర్కొన్నారు. ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, అన్నదాతల ఇంట సుఖసంతోషాలు వెల్లి విరియాలని బండి వెంకటేశ్ యాదవ్ స్వామివారిని వేడుకున్నారు.

### భక్తులకు అన్నదానం

ఆరవ రోజు వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ మేరకు రాళ్లగూడ లోని జై భవాని యాదవ కాలనీ వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.



# అన్నదానం ఎంతో గొప్పది:బండి వెంకటేష్ యాదవ్

- జై భవాని నగర్, యాదవ్ కాలనీ లో ఘనంగా వినాయక ఉత్సవాలు
- భక్తులకు అన్నదానం నిర్వహించిన ఉత్సవ కమిటీ నేతలు





**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (నగరనిజం ప్రతినిధి):** అన్నదానం ఎంతో గొప్పదని కాంగ్రెస్ సీనియర్ నేత బండి వెంకటేష్ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఆకలితో ఉన్న పేద ప్రజల ఆకలి తీర్చడం గొప్ప విషయం అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పేద ప్రజలకు అన్నదానం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ వద్ద జై భవానీ నగర్, యాదవ్ కాలనీ బస్తీల్లో సోమవారం నాడు నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో బండి వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ మేరకు వినాయక ఉత్సవాల్లో భాగంగా జై భవాని నగర్, యాదవ్ బస్తీ వాసులకు అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ నేత బండి వెంకటేష్ యాదవ్ తో పాటు ఉత్సవ కమిటీ నేతలు వరదారెడ్డి, కుక్కల కృష్ణ, ముద్దం మల్లేష్, లాలయ్య యాదవ్, రాజు, అంజి యాదవ్, శివ యాదవ్, ముఖేష్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం నిర్వహించారు.




ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ నేత బండి వెంకటేష్ యాదవ్.... జీవితంలో అన్నదానం ఎంతో గొప్పదన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రజలకు అన్నదానం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

# బీసీ సంఘం జిల్లా కన్వీనర్‌గా శంకర్ కురుమ ఏకగ్రీవం





**వికారాబాద్ జిల్లా (నగర నిజం) ప్రతినిధి సెప్టెంబర్1** వికారాబాద్ జిల్లా బీసీ సంఘం కన్వీనర్ గా బొర్ర శంకర్ కురుమ ను శనివారం బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల ఐక్యతకు నిరంతరం పోరాడాలని వికారాబాద్ జిల్లాలో మండలాల వారీగా కమిటీలు వేసి బలపరచాలని ఆయన అన్నారు. బీసీల సమస్యలపై నిరంతరం పోరాడాలని అన్నారు.బీసీల ఐక్యతకు తోడ్పడి 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేంత వరకూ మన బీసీల తరపున ఉద్యమాలు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కే సాయన్న ముదిరాజ్,గొర్రెల మేకల పెంపకం దారుల వనపర్తి జిల్లా అధ్యక్షులు మధు యాదవ్, పూడూరు మండల్ మాజీ ఎంపీపీ మల్లేష్,దేవనోనిగూడెం మాజీ సర్పంచ్ నారాయణ యాదవ్,సిరిగాయిపల్లి మాజీ సర్పంచ్ వెంకటదాసు, వికారాబాద్ బీసీ సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం యాదవ్,బీసీ సంఘం ధారూర్ మండల కన్వీనర్ సుధాకర్ యాదవ్,బీసీ సంఘం వికారాబాద్ మండల కన్వీనర్ యాదగిరి యాదవ్,సంపత్ యాదవ్, మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.







# సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి

- పేరుకు మాత్రమే గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ?
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు పి.జగన్

**అపరిశుభ్ర పరిసరాలపై బ్లీచింగ్ పౌడర్ చల్లిన సీపీఐ(ఎం) నేతలు**



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 1 ( నగరనిజం ) : సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు పి.జగన్ కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలోని అపరిశుభ్ర పరిసరాలు మరియు డ్రైనేజీలపై సీపీఐ(ఎం) నాయకులు బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.జగన్ మాట్లాడుతూ... వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల వలన ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు ముందస్తుగా గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వర్షాలకు ప్రజలు ముఖ్యంగా చిన్నపిల్లలు డెంగ్యూ మలేరియా వంటి విష జ్వరాల బారిన పడే అవకాశం ఉంది కాబట్టి, గ్రామాల్లో దోమల మందు కొట్టడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అన్నారు. సర్పంచులు లేకపోవడం వలన పంచాయతీ కార్యదర్శులపైన పనిభారం పెరుగుతుందని, ప్రత్యేక అధికారులు పేరుకు మాత్రమే ఉన్నారని అన్నారు. గ్రామాలకు రావలసిన నిధులు సకాలంలో రాకపోవడంతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన అగమ్యగోచరంగా మారిందన్నారు. పరిసరాల పరిశుభ్రత, ప్రజా ఆరోగ్యానికి అధిక నిధులు కేటాయించి ప్రత్యేక కార్యచరణ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ మాజీ ఎంపీటీసీ నీరుడు బిక్షపతి, సీపీఐ(ఎం) నాయకులు పల్లపు రవి, పెర్క యాదయ్య, అచ్చన రాములు, కమలమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో రియల్టర్ల నయా మోసాలు





- భూముల ధరలకు రెక్కలు రావడంతో పబ్లిక్, పార్కు స్థలాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పబ్లిక్, పార్కు స్థలాల అన్యాక్రాంతం పై అధికారుల మౌనవ్రతం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా లోని శంషాబాద్ లో భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నయా మోసాలకు తెరలేపుతున్నారు. 20 ఏళ్ల క్రితం వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకొని బిచానా ఎత్తేసిన రియల్ వ్యాపారులు ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో నయా మోసాలకు పాల్పడుతున్నారు. పార్కులు, పబ్లిక్ స్థలాలంటూ బూచిగా చూపి ప్లాట్లను అమ్మేసుకొని జారుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూముల ధరలకు రెక్కలు రావడంతో గతంలో వదిలేసిన పబ్లిక్, పార్కు స్థలాలను తిరిగి ప్లాట్లుగా మార్చి అమ్మేసుకుంటున్నారు. మరికొందరైతే గతంలో విశాలమైన రోడ్లు లేఅవుట్ లో చూపించి ప్లాట్లు విక్రయించాక ఇప్పుడు భూముల ధరలు అమాంతం పెరగడంతో రోడ్లను సైతం ప్లాట్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే పార్కు, పబ్లిక్ స్థలాలను కాపాడాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డు... అదుపూ లేకుండా పోతోంది. రంగారెడ్డి జిల్లా లోని హిమాయత్ సాగర్, గండిపేట జంట జలాశయాల పరిరక్షణ కోసం 1996 లో ప్రభుత్వం శంషాబాద్ పట్టణంతో పాటు మండలంలోని 43 గ్రామాలను జీవో 111 నిబంధనల పరిధిలోకి చేర్చింది. దీని ప్రకారం ఎక్కడ కూడా ఎలాంటి వెంచర్లు గానీ, నిర్మాణాలు గానీ చేపట్టడానికి వీలు లేదు. అయితే 20 ఏళ్ల క్రితం శంషాబాద్ వద్ద రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తోపాటు శంషాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కావడంతో ఇక్కడ భూముల ధరలు అమాంతం పెరిగాయి. విమానాశ్రయం రాకముందు 200 రూపాయలకు గజం భూమి పలికిన భూమి తర ఇప్పుడు వేలల్లో లక్షల్లో చేరుకుంది. విమానాశ్రయం రాకముందు ఎకరా భూమి ధర 15 వేలు కాగా ప్రస్తుతం 8 నుంచి 10 కోట్లకు చేరింది. అయితే 20 ఏళ్ల క్రితం శంషాబాద్ వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు రూపకల్పన జరిగాక రియల్ ఎస్టేట్ వ్యాపారులు శంషాబాద్ పై వాలిపోయారు. విమానాశ్రయం... ఔటర్ రింగ్ రోడ్డు చిత్రాలను వేసి జీవో ట్రిబుల్ వన్ నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లను రూపొందించారు. విశాలమైన రోడ్లు.... పబ్లిక్ స్థలాలు, పార్కు స్థలాలు అంటూ రంగురంగుల బ్రోచర్లు రూపొందించి ప్లాట్ల వ్యాపారానికి తెర లేపారు. ఈ విధంగా శంషాబాద్ తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వందలాది వెంచర్లు వెలిశాయి.దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాయాజాలంలో పడ్డ చాలామంది అమాయక జనం పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొనుగోలు చేసుకున్నారు. 20 ఏళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలు చేసిన జనం అప్పు సప్పు చేసి నివాసాలు నిర్మించుకున్నారు. అయితే ప్రస్తుతం శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. శంషాబాద్ వద్ద గతంలో 200 రూపాయలు గజం పలికిన భూమి ధర ఇప్పుడు 40 వేల నుండి లక్ష రూపాయల వరకు చేరుకుంది. దీంతో 15, 20 ఏళ్ల క్రితం వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయించుకొని జారుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు నయా మోసాలకు తెరలేపుతున్నారు. గతంలో తాము రూపొందించిన లేఔట్లలో పబ్లిక్ స్థలాలుగా చూపి వదిలేసిన స్థలాలను ప్లాట్లుగా మారుస్తూ అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వాస్తవానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు రూపొందించిన వెంచర్లలో ప్రజా ప్రయోజనార్థం వదిలేసిన పబ్లిక్ స్థలాలను ఆయా గ్రామపంచాయతీలకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. కానీ పబ్లిక్ స్థలాలను కాపాడాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం రియల్ వ్యాపారులకు వరంగా మారింది. అసలే అక్రమ లేఅవుట్లు... ఇక మమ్మల్ని అడిగేది ఎవరు అన్నట్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. పబ్లిక్ స్థలాలు, పార్కు స్థలాలను ప్లాట్లుగా మార్చి దర్జాగా విక్రయించేస్తున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాల్లగూడ, మధురానగర్, ఆర్.బి నగర్, తొండుపల్లి, ఘాంసిమియాగూడ,చిన్న గోల్కొండ,శంకరాపూర్, గొల్లపల్లి,నర్కూడ, కాచారం, రాయన్నగూడ, పెద్ద షాపూర్, జూకల్ ఇలా అనేక చోట్ల లేఅవుట్లలో పబ్లిక్ స్థలాలు హుష్ కాకీ అవుతున్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీ తో పాటు మండలం లోని ఆయా గ్రామాల్లో వెలసిన అక్రమ వెంచర్లలో పబ్లిక్, పార్కు స్థలాలు భూతద్దం పెట్టి వెతికినా కనిపించే పరిస్థితి లేదు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోనిఆర్ బి నగర్ లో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గతంలో విశాలమైన రోడ్లను చూపి ప్లాట్లను విక్రయించారు. ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోడ్డును కుదించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

## అధికారులు మేల్కొనాలి - శంషాబాద్ ప్రజల వినతి

శంషాబాద్ మున్సిపాలిటీ తో పాటు మండలం లోని వివిధ గ్రామాల్లో అక్రమంగా వెలసిన వెంచర్లలో పబ్లిక్ కమ్యూనిటీ ఫలాలతో పాటు, పార్కు స్థలాలను పరిరక్షించడానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కమ్యూనిటీ స్థలాలు, పార్కు స్థలాలను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే రియల్ ఎస్టేట్ వ్యాపారులు పబ్లిక్ కమ్యూనిటీ స్థలాలతోపాటు, పార్కు స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకుంటారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.






# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- నూతన రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 1 ( నగరనిజం ) : గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాతనే నిరుపేదలకు రేషన్ కార్డుల కల సాకారం అయిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. సోమవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో రేషన్ షాపుల వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డు లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... గడిచిన పది సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేసిన పాపాన పోలేదన్నారు. నిరుపేదలు రేషన్ కార్డులు లేక చాలా ఇబ్బందులు పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు మంజూరు చేసిందని, వారికి బియ్యం పంపిణీ కూడా చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి దాసరమోని రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, మార లక్ష్మణ్, కంబాలపల్లి బుగ్గరాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, అంతటి రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని దయతో ప్రజలంతా చల్లగా ఉండాలి

- మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి
- వాడవాడలా పూజలు అందుకుంటున్న గణనాథుడు



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 1 ( నగరనిజం ) : విఘ్నేశ్వరుని దయతో ప్రజలంతా చల్లగా ఉండాలని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు. వినాయకచవితి నవరాత్రులలో భాగంగా పెద్ద అంబర్పేట్ మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్, తదితర కాలనీలలో వెలసిన బొజ్జ గణపయ్య నాలుగవ రోజు పూజలు అందుకుంటున్నారు. పలు కాలనీల గణేష్ మండపాల కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు నగర్ తాజా మాజీ వైస్ చైర్మన్ చామా సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఆ విఘ్నేశ్వరుని అనుగ్రహంతో మున్సిపల్ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కాలనీల ప్రజలందరికీ గణనాథుని ఆశీస్సులు ఉండాలని, సిరిసంపదలు సిద్ధించాలని సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు సుభిక్షంగా పండాలని ఆ విగ్నేశ్వరుడిని కోరినట్లు పేర్కొన్నారు. ఆ విగ్నేశ్వరుని దయతో విఘ్నాలన్ని తొలగిపోవాలని కోరినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. భక్తి,శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఛామా సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి, తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ నవరాత్రి ఉత్సవాలలో తాజా మాజీ కౌన్సిలర్ జోర్క గీత శ్రీరాములు ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి కొండల్ గౌడ్, ఛామ అనుకిరణ్ రెడ్డి, పలు కాలనీల వాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చిరుద్యోగి శస్త్ర చికిత్సకు వెస్సో అరవై వేల సహాయం





**ఒంగోలు సెప్టెంబర్ 1 (నగరనిజమ్ న్యూస్):** చిరుద్యోగి శస్త్ర చికిత్సకు వెస్సో అరవై వేల సహాయం అందించి తన దాతృత్వాన్ని చాటుకుంది.ఒంగోలు నివాసి లక్కవరపు ప్రసన్నాంజనేయులు (50) ఫైబర్ నెట్‌లో దినసరి వేతనానికి పని చేస్తూ కుటుంబ జీవనం కొనసాగిస్తున్నారు. సుమారు నాలుగు నెలల క్రితం జరిగిన ఒక రోడ్డు ప్రమాదం లో ఆయన చేతి ఎముక మూడు చోట్ల విరిగినది. ప్రమాదంలో మెదడుకు క్లాట్ ఏర్పడిన కారణంగా చేయి స్పర్శను కోల్పోయింది. నడుము మరియు కాలి నుండి ఎముకను తీసి చేతికి అమర్చడం జరిగింది. స్థానిక సంఘం వారి ఆర్థిక సహాయంతో మొదటి సర్జరీ చేయించినప్పటికీ, సర్జరీ విజయవంతం కాకపోవడం వలన, మరొకసారి చేతికి సర్జరీ, ఆ పిదప ఆరు నెలల పాటు ఫిజియో థెరపీ చేయవలసి ఉంది.ప్రసన్న ఆంజనేయులు గత నాలుగు నెలలుగా మంచానికే పరిమిత మయ్యారు. తిరిగి కోలు కొనటానికి మరొక ఆరు నెలల సమయం పడుతుంది. కుటుంబం లోని ఏకైక సంపాదనాపరుడు మంచానికి పరిమితం కావడంతో, ఆదాయం లేక ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ, ప్రసన్న ఆంజనేయులు శస్త్ర చికిత్స కూడా వాయిదా వేయడం జరిగింది.ప్రసన్న ఆంజనేయులు తనకు జరగబోయే తదుపరి శస్త్ర చికిత్స కొరకు ఆర్థిక సహాయం చేయమని, స్థానిక నాయకుల ద్వారా వెస్సో ని ఆశ్రయించారు. వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో ప్రసన్న ఆంజనేయులు కు 60,000/-ల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ ఆదాయం లేక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న చిరుద్యోగి ప్రసన్నాంజనేయులు శస్త్రచికిత్స కు సహాయం చేసి ఆదుకొన్న గౌరవ దాతలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# సామాజిక న్యాయం బిజెపితోనే సాధ్యం

- డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు

**హైదరాబాద్ సెప్టెంబర్ 1 (నగరనిజం న్యూ స్)**బీసీలకు నిజమైన న్యాయం చేయగల పార్టీ బీజేపీ మాత్రమే. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను మతపరమైన ముస్లిం రిజర్వేషన్లుగా మార్చే రేవంత్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకునేది కూడా బీజేపీ మాత్రమేనని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు..సోమవారం బిజెపి రాష్ట్ర అద్యక్షులు ఎన్.రామచంద్రా రావు సమక్షం లో బిజెపి పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అధికారికంగా జనగణనతో పాటు కులగణన చేపట్టబోతున్న ఏకైక పార్టీ బీజేపీ. నిజమైన సామాజిక న్యాయానికి పునాదులు వేస్తున్న బీజేపీలో చేరడం ప్రజలకు నిజాయితీతో సేవ చేసే అవకాశం వస్తుందనే నా విశ్వాసం” అని అన్నారు.బీసీలకు 42% రిజర్వేషన్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం తప్పులు చేస్తూ మోసం చేసే ప్రయత్నం చేస్తోంది అని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షం అయిన బీఆర్ఎస్ కూడా ఈ అంశంలో నిజమైన చిత్తశుద్ధి చూపలేదని తెలిపారు. బీజేపీ మాత్రమే బీసీలకు న్యాయం చేయగలదనే నమ్మకంతోనే తాను పార్టీలో చేరినట్టు స్పష్టం చేశారు. “తర చేరిక పదవుల కోసం కాదు, సేవ కోసం. నా జీవితం అంతా బీసీల హక్కుల కోసం అంకితం” అని వకుళాభరణం తెలిపారు. ముస్లింలకు మతం ఆధారంగా ఇచ్చిన 4% రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధమని అప్పుడే తాను గట్టిగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీల వాటాను కాపాడుకోవడం, కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పెంపు అవసరం అని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రారంభమైన ఈ పోరాటాన్ని ఇప్పుడు జాతీయ వేదికపై ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.ఇక.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారు అత్యవసర సమావేశం నిమిత్తం ఢిల్లీకి వెళ్లాల్సి వచ్చినా, ఉదయం ప్రత్యేకంగా కలసి డా. వకుళాభరణం గారికి శాలువా కప్పి అభినందించారు. ఈ నెల 3న కరీంనగర్‌లో జరగనున్న పార్టీ పదాధికారుల సమావేశానికి హాజరై, శ్రేణులకు పరిచయ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆహ్వానించారని డా. వకుళాభరణం తెలిపారు.ఈ సందర్భంగా... డా. వకుళాభరణం బీసీల హక్కుల కోసం పోరాటం చేసిన విషయాలను రాజ్యసభ సభ్యుడు డా.కెలక్ష్మణ్ గారు గుర్తుచేశారు. బిజెపి ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందని యావత్ బీసీ సమాజం అంతా నరేంద్ర మోదీ గారి నాయకత్వం పట్ల నమ్మకం, విశ్వాసంతో ఉందని లక్ష్మణ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు బీసీ కమిషన్ సభ్యుడిగా, తెలంగాణ రాష్ట్రంలో తొలి బీసీ కమిషన్ సభ్యుడిగా, అనంతరం రెండోసారి హయాంలో బీసీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన అపార అనుభవం గల డా. వకుళాభరణం కృష్ణమోహన్ బిజెపిలో చేరిన సందర్భంగా వారిని బిజెపి కుటుంబంలోకి స్వాగతించారు. మేధావులు, సామాజిక వర్గాలు బీజేపీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై వరుసగా పార్టీలో చేరుతున్నారని, ముఖ్యంగా కృష్ణమోహన్ గారు చేరిక పార్టీకి శక్తివంతమైన అస్త్రం అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య గారు అన్నారు. కృష్ణమోహన్ గారు బీసీ కమిషన్ చైర్మన్‌గా కాకముందే, 30 ఏళ్లకు పైగా బీసీల హక్కుల కోసం పోరాడిన చరిత్ర



కలిగిన నాయకుడు. 1986 నుంచే అనేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన మచ్చలేని, పవిత్రమైన నాయకత్వం మోడీ సిద్ధాంతాలతో కలసి బీజేపీకి పటిష్టతను తెస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అనేక కుల సంఘాలు, నాయకులతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయని, సమాజ హితంలో ఎప్పుడూ ముందుండే వ్యక్తి అని ప్రశంసించారు. వకుళాభరణం కృష్ణమోహన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు బీసీ కమిషన్ సభ్యుడిగా, తెలంగాణ రాష్ట్రంలో తొలి బీసీ కమిషన్ సభ్యుడిగా, అనంతరం రెండోసారి హయాంలో బీసీ కమిషన్ చైర్మన్‌గా సేవలందించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్ రావు కండువా కప్పి స్వాగతించి, ప్రాథమిక సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ,జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ , హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్ , రామరావ్ పాటిల్ , డా. పాల్వాయి హరీష్ బాబు , సూర్యనారాయణ గుప్తా , మాజీ ఎంపీ సీతారాం నాయక్ , మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు , ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

# గుట్టలో ఘనంగా ఎరుకల తెగ విమోచన దినోత్సవం

- జెండా ఎగురవేసిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మానుపాటి కృష్ణ



యాదగిరిగుట్ట , సెప్టెంబర్ 1 (నగరనిజం న్యూస్ ): పుణ్యక్షేత్ర పట్టణమైన యాదగిరిగుట్టలో ఆదివారం ఎరుకల తెగ విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మానుపాటి కృష్ణ కుర్రు జెండా ( ఎరుకల జెండా ) ను ఆవిష్కరించారు. టిఎన్నో పోరాటాల ఫలితంగా నిర్బంధ సిటి క్రిమినల్ ట్రైబ్ యాక్ట్ ( సి టి యాక్ట్) చట్టాన్ని 1951 ఆగస్టు 31వ తేదీన భారత ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. అప్పటినుండి ఆగస్టు 31వ తేదీని విమోచన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఎరుకల తెగ ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మానుపాటి కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుండి గ్రామాల నుండి వచ్చిన ఎరుకల తెగ కులస్తులు పాల్గొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు మానుపాటి పరుశురాం, సముద్రం యాకయ్య, మండల మహిళా అధ్యక్షులు దేవరాయి మంజుల, మానుపాటి పెంటయ్య, మానుపాటి తోటరాజు, మానుపాటి వెంకటేశు, మానుపాటి చిన్న రాజు, మానుపాటి నడిపి రాజు, రుద్రాక్ష మహేష్, మానుపాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ను పునరుద్ధరించండి

- ఏ ఐ ఎన్ పి ఎస్ ఈ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్



హైదరాబాద్ సెప్టెంబర్ 1 (నగరనిజం న్యూస్)బీపాత పింఛను పథకం పునరుద్ధరణ చేసే వరకు, విశ్రమించే ప్రసక్తే లేదని, సి పి ఎస్ ను రద్దు చేసేలా పాలకులను ఒప్పించి తీరతామని ఆల్ ఇండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ దక్షిణ భారత ఇంచార్జ్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు.సోమవారం నాడు ఆయన హైదరాబాద్ లో మాట్లాడుతూ..పాలకులు ఇక నైనా ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ను పునరుద్ధరించి చారిత్రక, సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సొమ్ము ను షేర్ మార్కెట్ లో.. పెట్టి అక్కడ వచ్చే లాభ,నష్టాల తో పింఛను ఇవ్వాలి అనుకోవడం ఎంత వరకు భావ్యమో.. ఆలోచించించుకోవల్సిన అవసరం,ధర్మం ప్రభువుల విచక్షణ కే ఉందన్నారు. ఎన్నికల సమయంలో "సి పి ఎస్ రద్దు చేస్తాం" అని నమ్మబలికే రాజకీయ పార్టీలు, ఆ తర్వాత సి పి ఎస్ రద్దు ఊసే ఎత్తకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. "సి పి ఎస్ రద్దు చేయండి అని మహా ప్రభో" అని అడిగినపుడల్లా ఉద్యోగులను ఏదో ఒకటి చెప్పి మభ్య పెట్టే ప్రయత్నమే చేస్తూ వచ్చారని రఘునందన్ ఎద్దేవా చేశారు.పాత పింఛను పథకం పునరుద్ధరణ గురించి ప్రభుత్వాలు ఇంకా కూడా మీన, మేషాలు లెక్కిస్తే..ఉద్యమం ఉధృతం చేయకతప్పని పరిస్థితులు తలెత్తే అవకాశం లేకపోలేదని రఘునందన్ అభిప్రాయపడ్డారు.

# వివేకానంద నగర్‌లో ఘనంగా వినాయకుడి పల్లకీ సేవ





- హిందూ వికాస గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి పల్లకీ సేవ
- ఉత్సాహంగా స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్న కాలనీవాసులు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (నగరనిజం ప్రతినిధి): ఆధ్యాత్మికతకు కేంద్రంగా మారిన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో మరో ఆధ్యాత్మిక కార్యక్రమం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన విగ్నేశ్వరుడి పల్లకీ సేవ వేడుకల్లో హైలెట్ గా నిలిచింది. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో పర్యావరణానికి పెద్ద పీఠ వేస్తూ ఇప్పటికే ప్రతి ఏటా మట్టి గణపతిని ప్రతిష్ఠించడం ఆనవాయితీగా వస్తోంది.అంతేకాకుండా గణేష్ ఉత్సవాల్లో భాగంగా హిందూ వికాస గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రఘునాథరెడ్డి సారథ్యంలో ఇక్కడ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను భక్తి పారవశ్యంలో ముంచేస్తోంది. వేడుకల్లో పాల్గొంటున్న రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధుల నుండి మొదలుకొని పోలీసు ఉన్నతాధికారులు సైతం హిందూ వికాస గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకుల కృషిని ప్రశంసిస్తున్నారు. ఈ తరుణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వివేకానంద నగర్ కాలనీలో ప్రకృతి వరసిద్ధి వినాయకుడికి పల్లకీ సేవ నిర్వహించారు. మట్టి వినాయకుడిని పల్లకీలో కూర్చోబెట్టి కాలనీ మొత్తం ఊరేగించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామివారి పల్లకీ సేవలో పాల్గొని తరించారు. దారి పొడవునా ప్రకృతి వరసిద్ధి వినాయకుడిని కీర్తిస్తూ భక్తులు భజన గీతాలు ఆలపించారు. వినాయక మండపం నుంచి మొదలైన స్వామివారి పల్లకీ సేవ ర్యాలీ వివేకానంద నగర్, వెల్లంకి నగర్ కాలనీల మీదుగా సాగింది. స్వామివారి పల్లకీ సేవ తో వివేకానంద నగర్ కాలనీలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

## ఆకట్టుకున్న భజన మండలి సాంస్కృతిక కార్యక్రమాలు

ఆదివారం రాత్రి స్వామివారి పల్లకీ సేవ అనంతరం శ్రీ వెంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. రాజమండ్రి నుండి తరలివచ్చిన కళాకారులచే వివిధ దేవతామూర్తుల వేషధారణలతో నిర్వహించిన భక్తి సంకీర్తన కార్యక్రమం అందరిని భక్తి పారవశ్యంలో ముంచేసింది. అనంతరం కాలనీలోని బాల బాలికలచే నిర్వహించిన కర్ర సాము అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి చెన్నారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, చంద్రమౌళి, సుదర్శన్ రెడ్డి, యోగేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ నేత బల్వంత్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నేత శ్యామ్ తదితర నేతలు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## 700 మందికి అన్నదానం

ఐదవ రోజు గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని హిందూ వికాస గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 700 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన కాలనీవాసులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాదాలు స్వీకరించారు.







# ఉద్యోగ ధర్మంలోనూ అత్యున్నత శిఖరాలకు...





- యాదగిరిగుట్ట దేవస్థానం ఏఈఓ గజవెల్లి రమేష్ బాబు పదవీ విరమణ

యాదగిరికొండ ,సెప్టెంబర్ 1 (నగరనిజం న్యూస్ ): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి దాతల సహకారం కోసం ... సంఘం అధ్యక్షుడిగా దేవస్థానం ఉద్యోగుల ప్రయోజనాల కోసం ... జేఏసీ చైర్మన్ గా రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల కోసం పాటుపడటం... ఇలా బహుముఖంగా పనిచేసి సహాయ కార్య నిర్వహణ అధికారిక గా (ఏఈఓ )గజవెల్లి రమేష్ బాబు పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం ఉద్యోగిగా మాత్రమే పదవీ విరమణ చెందానని ... తమ ఇలవేల్పు అయిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సేవలో జీవితాంతం తరిస్తూనే ఉంటానని అన్నారు.

## ఎన్ ఎం ఆర్ స్థాయి నుంచి...

1986లో నాన్ మస్టర్ రోల్ ( ఎన్ ఎం ఆర్ )ఉద్యోగిగా తన సేవలను ప్రారంభించిన గజవెల్లి రమేష్ బాబు పదవీ విరమణ చేసే సమయానికి (31/8/2025) దేవస్థానం సహాయ కార్యనిర్వాహణాధికారి ( ఏఈఓ ) గా... రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గా ఉన్నారు.. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఎన్నో సన్మానాలు ,సత్కారాలు అందుకున్నారు.. నిగర్వి, మృదుభాషి ,సదా సాటి ఉద్యోగస్తుల కోసం నిరంతర కృషి ఆయన నైజం.

## టీఎన్జీవోల సంఘంలో విలీనం...

దేవాలయాల ఉద్యోగులను టీఎన్జీవోల సంఘంలో విలీనం చేయడంలో రమేష్ బాబు చేసిన కృషి అంతా ఇంతా కాదు.. అప్పటి టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు స్వామి గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా టీజేఏసి నాయకుడు మందడి ఉపేందర్ రెడ్డి ఈ విషయంలో తనకు సహకరించారని తెలిపారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దేవాలయ ఉద్యోగులకు పిఆర్సి, కారుణ్య నియామకాల జీవో సాధించడంలో ఆయన కృత కృతుడయ్యాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో సకలజనుల సమ్మెలో రాష్ట్రం లోని దేవస్థానం ఉద్యోగస్తులను ఉద్యమ బాటలో నడిపించారు. కాగడాల ప్రదర్శన, సుదర్శన హోమం వంటి ఉద్యమాలు నడిపించారు. ఆయన ప్రతిభాపాటవాలను గుర్తించిన రాష్ట్ర టిఎన్జీవోల సంఘం వారు తమ సెంట్రల్ కమిటీలో ఉపాధ్యక్షుడిగా గజవెల్లి రమేష్ బాబుకు సముచిత స్థానం కల్పించి గౌరవించింది. రాష్ట్ర సాధన అనంతరం రెండు వేతన సవరణలు ( పి ఆర్ సి) సమకూరాయని, అలాగే గత సంవత్సరం జూలై నుంచి మరొక పి ఆర్ సి రావాల్సి ఉందని అన్నారు. దేవస్థాన ఉద్యోగస్తులకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్న డిమాండ్ ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు.

## ఎన్ఎంఆర్ ల క్రమబద్ధీకరణ....

శ్రమైక జీవన సౌందర్యం... కృషితో నాస్తి దుర్భిక్షం... అని నమ్మే గజవెల్లి రమేష్ బాబు యాదగిరిగుట్ట దేవస్థానంలో 20 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న 42 మంది ఎన్ ఎన్ ఆర్ లను క్రమబద్ధీకరించడంలో సఫలీకృతుడయ్యాడు. ఉద్యోగాలు చేస్తూ కన్ను మూసిన ఎంఎంఆర్ ల పక్షాన ఉద్యోగంలో చేరిన వారి క్రమబద్ధీకరణ ఇంకా జరగాల్సి ఉందన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహుని సేవలో....

ఒకవైపు ఉద్యోగస్తుడిగా పని చేస్తూనే... మరోవైపు దేవస్థానం అభివృద్ధిలో భాగంగా భక్తులు, యాత్రికుల వసతి సౌకర్యం కోసం గదులు, కాటేజీల నిర్మాణం కోసం దాతల అన్వేషణలో ఇతర ఉద్యోగస్తులతో పాటు రమేష్ బాబు చేసిన కృషి మరువలేనిది అంటారు. పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని యాదగిరిగుట్ట దేవస్థానంలో విలీనం చేయడంలో ఆయన ఎంతగానో పాటుపడ్డారు. ఫలితంగా అక్కడ పనిచేసే దేవస్థాన ఉద్యోగులకు ప్రయోజనాలు సమకూరాయని ...దేవస్థానం కూడా క్రమంగా అభివృద్ధి చెందేందుకు దోహద పడిందని... కేడర్ స్ట్రెంత్ సాధించి తీసుకురావడంతో ఉద్యోగస్తులందరికీ ప్రయోజనాలు.. ఉద్యోగ ఫలాలు అందినాయని పలువురు ఉద్యోగస్తులు ఆయనను ఎంతగానో కొనియాడారు. మస్కట్లో (విదేశం )శ్రీ స్వామివారి కల్యాణోత్సవ నిర్వహణకు కృషిచేసి అక్కడికి వెళ్లి అందులో పాల్గొన్నారు... భద్రాచలం, శ్రీశైలం వంటి దేవస్థానం జాతరలలో... విశేష ఉత్సవాలలో ఆయన ప్రత్యేక విధులు కూడా నిర్వర్తించారు.

## సహకారం మరువలేనిది...

పదవీ విరమణ సందర్భంగా గజవెల్లి రమేష్ బాబు దంపతులను ఉన్నతాధికారులు, సహ ఉద్యోగస్తులు ఘనంగా సన్మానించారు. ఒక ఉద్యోగస్తుడిగా, రాష్ట్ర జేఏసీ చైర్మన్ గా తనకు సహకరించిన ముఖ్యమంత్రులకు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రజాప్రతినిధులకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ తదితర ఉన్నతాధికారులకు, ధర్మకర్తలకు ,సహ ఉద్యోగులకు, స్నేహితులకు సదా రుణపడి ఉంటానని గజవెల్లి రమేష్ బాబు చేతులెత్తి నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీలకు అన్యాయం చేస్తున్న రేవంత్ సర్కార్

## బీజేపీ నేత కొండా పరమేష్ గౌడ్ ఫైర్

- ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడం వల్ల ప్రయోజనం లేదన్న పరమేష్ గౌడ్
- ముస్లింల వల్ల బీసీల ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన
- ముస్లింలను బీసీ జాబితాలో నుండి తప్పించి చిత్తశుద్ధిని చాటుకోవాలని పరమేష్ గౌడ్ సూచన



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 (నగరనిజం ప్రతినిధి): ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత కొండా పరమేష్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లుగా ప్రభుత్వం నాటకం ఆడుతోందని ఆయన విమర్శించారు. సోమవారం నాడు శంషాబాద్ వద్ద మీడియాతో మాట్లాడిన కొండా పరమేష్ గౌడ్.... బీసీలకు ఇప్పటికే 35 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ముస్లిం లను బీసీ జాబితాలో చేర్చి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించడం వల్ల బీసీలకు ఒరిగిందేమీ లేదని, ఉన్న ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 10 శాతం ఉన్న ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడం వల్ల బీసీల ప్రయోజనాలు దెబ్బతింటాయని పరమేష్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం తో పాటు భారతీయ జనతా పార్టీ సైతం మొదటినుండి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైఖరిని తప్పుపడుతోందని ఆయన గుర్తు చేశారు. బీసీలపై రేవంత్ రెడ్డి సర్కార్ కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీసీ జాబితాలో నుండి ముస్లింలను తప్పించాలని డిమాండ్ చేశారు. ముస్లిం మైనార్టీల మద్దతు కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కపట నాటకం ఆడుతోందని పరమేష్ గౌడ్ దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చేసే ప్రకటనను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కొండా పరమేష్ గౌడ్ బాబు గారు. ప్రభుత్వం ఎన్ని జిమ్మిక్కులు చేసినా సరే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సత్తా చాటడం ఖాయమని కొండా పరమేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE